

కెరమెరి మండలం చాల్‌బడిలో స్థానికులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్



జైనూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

# ఎన్నికల నిఘా..

## ఎలక్షన్ ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

● జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల ఏర్పాటు ● సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
● నిత్యం పర్యటనలు.. తనిఖీలు.. ● ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేసేందుకు ఎస్పీలు, కలెక్టర్ల సమీక్షలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల నేపథ్యంలో అధికారులతో పాటు పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. జిల్లాలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు మారుమూల గ్రామాలపై ప్రత్యేక దృ ష్టి పెట్టారు. జిల్లాలోని 597 పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శించడంతో పాటు సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్ స్వయంగా మారుమూల ప్రాంతాల్లో పర్యటిస్తూ గిరిజనులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, కొత్త వారెవరైనా వస్తే సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. ఈ ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు గట్టి బందోబస్తు మధ్య ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ఫిర్యాదుల కోసం..

2018 ఎన్నికల్లో జిల్లాలో 3,71,444 మంది ఓటర్లుండగా, ఈసారి ఓటర్ల సంఖ్య 4,47,934కు చేరింది. అంటే 76,490 మంది ఓటర్లు పెరిగారు. అందుకనుగుణంగా జిల్లాలో 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో సుమారు 190 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుండగా, 122 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి. నవంబర్ 30న జరిగే పోలింగ్‌తో పాటు డిసెంబర్ 3న జరిగే కౌంటింగ్ వరకూ ప్రతి విషయాన్ని పోలీసులు, అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 24గంటలు పనిచేసే విధంగా 1950, 08733279411 నంబర్లను అందుబాటు లో ఉంచారు. సీ-విజిల్ ద్వారా ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. గత ఎన్నికల్లో వివాదాలకు కారణమైన వారిపై దృష్టి పెట్టారు.

### చెక్‌పోస్టులతో నిరంతర నిఘా...

ఆసిఫాబాద్-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి రాకపోకలు సాగించే రహదారుల వద్ద ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వాంకిడి, వెంకట్రావ్‌పేట్, కెరమెరి, దహెగాం, బెజ్జూర్ ప్రాంతాలపై నిరంతర నిఘాతో పాటు పొ రుగు జిల్లాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ స్వయంగా కెరమెరి మండలంలోని బార్డర్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో అతిసమస్యాత్మకంగా పేరుగాంచిన చాల్‌బడి గ్రామాన్ని సందర్శించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో ఇప్పటికే కలెక్టర్ బోర్కడే హేమంత్ పలుమార్లు సమీక్షలు నిర్వహించి ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయడంతో పాటు ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా...

ఎన్నికల నేపథ్యంలో అధికారులు కోడ్‌ని పటిష్టంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, రోడ్లపై ఉన్న రాజకీయ ప్రకటనలకు సంబంధించిన బోర్డులను తొలగిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. మద్యం, డబ్బు తరలింపుపై నిఘా పెట్టారు. రూ. 10 వేల కంటే ఎక్కువ విలువగల మద్యం తరలిస్తే పట్టుకునేలా ఆంక్షలు పెట్టారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదనే ఆంక్షలు పెట్టారు. సర్వేలెన్స్ టీంలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంపై, ప్రతి పోలింగ్ కేంద్రంపై దృష్టిసారించారు. రాజకీయ నాయకులు ఎన్నికల సందర్భంగా చేసే ఖర్చులపై కూడా ప్రత్యేక అధికారులు బృందాలతో నిఘా ఏర్పాటు చేశారు. వీడియో రికార్డులు చేయడంతో పాటు రాజకీయ నాయకుల ప్రచారాలపై దృష్టిపెట్టారు.

### ఆదిలాబాద్ జిల్లాలో పది చెక్‌పోస్టులు

ఆదిలాబాద్, అక్టోబర్ 13 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అధికారులు ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ పార్టీలు ప్రజలను ప్రభావితం చేయకుండా నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లాలో సరిహద్దులో మహారాష్ట్ర ఉండడంతో అక్కడి నుంచి డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రాకుండా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర సరిహద్దులో మూడు చెక్‌పోస్టులు ఆదిలాబాద్ నియోజకవర్గం పరిధిలోని జైనథ్ మండలం పిప్పర్‌వాడ, బోథ్ నియోజకవర్గం పరిధిలో బోథ్ మండలం ఘన్‌పూర్, తలమడుగు మండలం లక్ష్మీపూర్‌ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వీటితోపాటు జైనథ్ మండలం ఆనంద్‌పూర్, బేల మండలం శంకర్‌గూడ, భీంపూర్ మండలం కరంజి, గాదిగూడ మండలం మేడిగూడ, నేరడిగొండ మండలం రోల్‌మామడ, ఉట్నూర్ మండలం, ఉట్నూర్ ఎక్స్‌రోడ్, కొత్తగూడలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పోలీసు, రవాణా, రెవెన్యూ, ఎక్సైజ్, అటవీశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. 24 గంటల వీటిల్లో తనిఖీలు కొనసాగుతాయి, సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు సమీక్షలు నిర్వహిస్తూ.. చెక్‌పోస్టులను క్రమంగా సందర్శిస్తూ సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేసే వస్తువులు, రూ.50వేల నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాను అరికట్టడానికి చెక్‌పోస్టుల్లో సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తారు. ఎన్నికల సమయంలో నిబంధనలు పాటించని వారిపైకఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు సూచిస్తున్నారు.

# గూండారాజ్యం వద్దు బీఆర్‌ఎస్ పాలనే ముద్దు

మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి ఇంట్లో టిఫిన్ చేస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండే విఠల్

## మంచిర్యాలలో మరింత ప్రగతి సాధించాలంటే మరోసారి గులాబీ జెండా ఎగరాలే

● సింగరేణి లాభాల్లో 32 శాతం వాటా ఇచ్చిన ఘనత మాదే
● దివాకరన్న గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం ● పార్టీకోసం కష్టపడ్డ వారి భవిష్యత్‌కు మాది భరోసా
● బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్
● మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డితో సమావేశం
● పాల్గొన్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండే విఠల్ ● ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చ

మంచిర్యాల, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలో గుండా రాజ్యం వద్దే వద్దని, బీఆర్‌ఎస్ పాలనే ముద్దు అని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి నివాసానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి విప్ వెళ్లారు. అరవిందరెడ్డితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం మంచిర్యాల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఎలా చేయాలి, ప్రజలను ఎలా సమన్వయం చేసుకోవాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఆపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గం కర్ఫ్యూలు.. గొడవలు లేకుండా ప్రశాంతవాతావరణంలో ఉండాలంటే మరోసారి బీఆర్‌ఎస్ జెండా ఎగరాలని స్పష్టం చేశారు. వ్యాపారులు, సామాన్య మధ్య తరగతి ప్రజలు వారి ప్లాట్‌ల కోసం పాట్లు పడకుండా ఉండాలంటే ఎమ్మెల్యే దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న సీఎం కేసీఆర్ అభ్యర్థులు, ఇన్‌చార్జిల సమావేశం నిర్వహిస్తున్నారని, అనంతరం బీ-ఫామ్‌లు ఇస్తారన్నారు. అది పూర్తయ్యాక 17వ తేదీ మంగళవారం నుంచి ప్రచార కార్యక్రమాలు ఉధృతం చేసేలా ప్రత్యేక కార్యచరణ రూపొందించుకున్నామన్నారు. దానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి కొన్ని బాధ్యతలు తీసుకున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మంచిర్యాల మరింత ప్రగతి సాధించాలంటే బీఆర్‌ఎస్ చేతిలోనే ఉండాలన్నారు. కచ్చితంగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కాబోతున్నారని, మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని విజ్ఞులు, మేధావులు, పెద్దలంతా మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

### భవిష్యత్తులో అవకాశాలు..

మంచిర్యాలలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. మంచిర్యాల జిల్లా అయ్యిందని, మెడికల్, నర్సింగ్ కాలేజీలు వచ్చాయన్నారు. గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ కింద ఆయకట్టు స్థిరీకరించుకున్నామని, మొన్నటికి మొన్న హాజీపూర్ మండలంలో రూ.85 కోట్లతో సుమారు 8వేల ఎకరాలకు సాగునీరిచ్చే ఎత్తిపోతల పథకాన్ని మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించుకున్నామన్నారు. మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో 32 శాతం వాటా ఇవ్వడం, వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరించి పిల్లలకు సింగరేణిలో ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మాదేనని తెలిపారు.. ఈ ఒక్క దసరా, దీపావళి బోనస్ కలిపి రూ.వెయ్యి కోట్లు కార్మికుల ఖాతాల్లో వేయబోతున్నామన్నారు. ఇప్పటికే రూ.2800 కోట్ల ఏరియర్స్ సింగరేణి కార్మికుల ఖాతాల్లో వేశామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాల హయాంలో జరగనంత అభివృద్ధి మంచిర్యాలలో జరిగిందన్నారు. ఈ అభివృద్ధి యజ్ఞం కొనసాగాలని, ఈ సంక్షేమ రాజ్యం కొనసాగాలని, ప్రశాంతమైన, శాంతియుతమైన వాతావరణంలో మంచిర్యాల ఉండాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, బ్రహ్మాండమైన వాతావరణంలో మంచిర్యాల ప్రజానీకం వ్యాపారాలు చేసుకొని సంతోషంగా బతకాలన్నారు. అలాంటి పరిపాలన కొనసాగాలంటే సౌమ్యుడు, అందరితో కులుపుగోలుగా ఉండే మా పార్టీ అభ్యర్థి దివాకర్ అన్నకు ఓటేసి మరొకసారి గెలిపించాలన్నారు. గతంలో 2018 ఎన్నికల్లో అందరం అరవిందరెడ్డి ఇంటికి వచ్చి భోజనాలు చేసి బయల్దేరి మంచిర్యాల గడ్డపై గులాబీ జెండా ఎగరేశామన్నారు. ఈ రోజు మళ్లీ ఇక్కడ కలుసుకొని ఉదయం అల్పాహారం చేసి బయల్దేరుతున్నామని, మరోసారి మంచిర్యాల గడ్డ మీద గులాబీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారందరి భవిష్యత్తుకు మాది భరోసా అని చెప్పారు.

### మా దివాకరన్న బంగారం..

మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి బీఆర్‌ఎస్ ఇన్-డైరెక్ట్‌గా సపోర్ట్ చేస్తుందని వస్తున్న ఆరోపణలపై బాల్క సుమన్ స్పందించారు. బంగారంలాంటి మా దివాకర్ అన్న ఉండగా అవతలి వారు మాకెందుకు అంటూ ప్రశ్నించారు. మంచిర్యాలలో మా అభ్యర్థి దివాకర్‌రావు అని, ఆయన గెలుపే లక్ష్యంగా మేమంతా పని చేస్తామన్నారు. హై కమాండ్ ఆదేశానుసారమే అందరం ఇక్కడ కలిశామని, రానున్న రోజుల్లో మరిత ఉధృతంగా ప్రచారం చేస్తామన్నారు. అవతలి పార్టీ వారు ఇలాంటి రూమర్స్ క్రియేట్ చేసి ప్రజల్లో ఒక రకమైన కన్ఫ్యూజన్ తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలాంటి అసత్య ప్రచారాలు ఎవరూ నమ్మొద్దని స్పష్టం చేశారు.



మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి ఇంట్లో టిఫిన్ చేస్తున్న విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

### 20వేల మెజార్టీతో దివాకర్‌రావును గెలిపించాలి: అరవిందరెడ్డి

తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారని మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన ఈ పదేళ్లలో సింగరేణి కార్మికుల కోసం ఎంతో చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్మికులకు లాభాల్లో వాటా ఇస్తుందన్నారు. 2014లో 16శాతం వాటా ఉంటే ఇప్పుడు 32 శాతం అయ్యిందన్నారు. నాకు తెలిసిన ఒక కార్మిక మిత్రుడికి రూ.1.60 లక్షల బోనస్ వచ్చిందన్నారు. పోయినసారి నాలుగు వేల మెజార్టీ ఇచ్చిన కోల్‌బెల్ట్ నుంచి ఈ సారి 20 వేల మెజార్టీ ఇవ్వాలన్నారు. మనందరం కలిసి తెలంగాణ తెచ్చుకున్నామని, కేసీఆర్‌కు కృతజ్ఞతగా దివాకర్‌రావుకు 20 వేల మెజార్టీ ఇచ్చి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీలకు టికెట్ ఇవ్వాలని తాను ప్రయత్నం చేశానన్నారు. కానీ సిట్టింగ్‌లకే టికెట్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, ఆ నిర్ణయం వెనుక ఎంతో ఆలోచన ఉందన్నారు. కచ్చితంగా మంచిర్యాలలో బీసీ మిత్రులు బలంగా ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో వారికి మంచి అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు.

### దొంగ మాటలు చెప్తున్న కాంగ్రెస్ : ఎమ్మెల్సీ దండే విఠల్

మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గెలిచి సీఎం కేసీఆర్ మూడోసారి హ్యాట్రిక్ సాధించాలనే ఉద్దేశంతో ప్రణాళిక రూపొందించుకున్నామని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బీసీ డిక్లరేషన్ అన్న కాంగ్రెస్ వాళ్లు, ప్రతి పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు బీసీలకు ఇస్తామన్నారన్నారు. కానీ ఈ రోజు మేం అలా చెప్పలేదు, ప్రజల్లో ఉన్న నాయకుడికే ఇస్తామని మాట మార్చారన్నారు. ఎలాంటి హామీ లేకుండా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మంథని, రామగుండం నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఇద్దరు బీసీలకు అవకాశం ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు టికెట్లు ఇస్తామని దొంగమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. దయచేసి ఆ పార్టీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

### గులాబీ జెండా ఎగరడం ఖాయం : ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాలలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకుంటున్నామన్నారు. పొరపాటున కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే గూండా రాజ్యం వస్తుందని, అందుకే ఈ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డ కచ్చితంగా బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలనే అభిప్రాయంతో ఉన్నారన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకుడు గంజాయి తాగిస్తూ యువతను పెడదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఆయన హైదరాబాద్‌లో క్లబ్ నడిపి, ఆ డబ్బు తీసుకువచ్చి ఇక్కడ వెదజల్లితే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. పొరపాటున ఆయనకు ఓటేస్తే అన్యాయం, అక్రమం, గుండాయిజం తప్ప మరొకటి ఉండదన్నారు. ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారన్నారు. టీబీజీకేఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, మంచిర్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పిట్టబొంగురం గ్రామంలో జాన్సన్ నాయక్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● సీఎం కేసీఆర్‌తోనే ప్రగతిబాటన పల్లెలు
● మరోసారి గులాబీ జెండా ఎగురవేద్దాం
● ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్
● ఇంద్రవెల్లి మండలంలో ప్రచారం

ఇంద్రవెల్లి, అక్టోబర్13: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం దక్కుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మండలంలోని దస్నాపూర్, పిట్టబొంగురం, మెండపల్లిగోండ్‌గూడ గ్రామాల్లో శుక్రవారం ఆయన జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని పిట్టబొంగురం గ్రామంలో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దస్నాపూర్ గ్రామంలోని పూలాజీబాబా ధ్యానకేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. జాన్సన్ నాయక్‌కు మహిళలు, యువకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మండలంలోని మెండపల్లిగోండ్‌గూడలో 150 మంది, పిట్టబొంగురంలో 100, దస్నాపూర్‌లో 80 మంది బీఆర్‌ఎస్‌లో చేరడంతో వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివాసీ పెద్దలతో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని ప్రజలను కోరారు. ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా మోసపూరిత హామీలతో గ్రామాలకు వచ్చే నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. జాన్సన్‌నాయక్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి, భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పిట్టబొంగురంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్

# అల్లరి

ALLARI

### చెప్పుకోండి



1. 'వందేమాతరం' గేయం ఏ నవల నుంచి తీసుకున్నారు?
2. పేపర్ కరెన్సీని విడుదల చేసిన మొదటి దేశం ఏది?
3. ఛత్రపతి శివాజీ రైల్వే టెర్మినస్ ఏ నగరంలో ఉన్నది?




### వింటర్ హ్యాండ్స్




పి. రమేశ్, కాటారం.

### పెద్దల మాట



అందరూ గొప్పగొప్ప సేవలు చేయలేరు. కానీ, చిన్నపాటి సేవ చేసినా గొప్పగా ఉండాలి.
● మదర్ థెరిస్సా

### పదసృష్టి



కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Heart

Ex : Art

జవాబులు: 1. ఆనందమఠ్, 2. చైనా, 3. ముంబై


## అత్యాశ

ఒక దట్టమైన అడవిలో ఓ గండుచీమ ఉండేది. ఒకరోజు దానికి నీటిపై ప్రయాణం చేయాలని ఆశ పుట్టింది. ఇంతలో పక్కనే ఉన్న చెట్టు నుంచి ఒక ఆకు రాలి కిందపడింది. దాంతో చీమ.. ''మిత్రమా! నాకు నీళ్లలో విహరించాలని ఉంది. నన్ను నీటిపై తీసుకెళ్తావా?'' అని అడిగింది. అందుకు ఆ ఆకు ''సరే!'' అన్నది. చీమను ఎక్కించుకుని.. నీటిపై ప్రయాణం చేయసాగింది ఆకు. అలా ప్రయాణిస్తున్న ఆ గండుచీమకు.. నీటిలోపల ఈత కొడుతున్న చేపపిల్ల కనిపించింది. అప్పుడు చీమ.. 'ఇలా ఆకుపై కూర్చొని ప్రయాణించడం ఏమంత బాగాలేదు. అలా చేపలా సొంతంగా ఈత కొట్టడంలోనే అసలైన ఆనందం ఉంది!' అనుకున్నది. వెంటనే చేపతో.. ''చేప మిత్రమా! నాకు నీలా నీటిలోపల మునకలు వేస్తూ తిరగాలని ఉంది. కొంచెం ఈత నేర్పించవా!?'' అని వేడుకుంది. చేప కూడా ''సరే!'' అంటూ, చీమకు ఈత ఎలా కొట్టాలో నేర్పించింది. దాంతో చీమ ఆనందంగా ఈత కొట్టసాగింది. నీటిపై ఈదుతూ.. గాలిలో ఎగురుతున్న పిచ్చుకను చూసింది చీమ. అంతే! ఎలాగైనా సరే తాను కూడా గాలిలో ప్రయాణించి తీరాలని నిర్ణయించుకుంది. పిచ్చుకను పిలిచి.. ''పిచ్చుక బావా! నన్ను గాలిలో తిప్పవా!?'' అని బతిమిలాడింది. పిచ్చుక కూడా కాదనలేక.. ''సరే!'' అంటూ, తన వీపుపై ఎక్కించుకుని గాలిలో తిప్పింది. అయితే, చీమకు మళ్లీ అత్యాశ కలిగింది. 'ఇలా పిచ్చుక వీపు మీద ప్రయాణించడం కన్నా.. నేనే స్వయంగా గాలిలో ఎగిరితే అద్భుతంగా ఉంటుంది కదా!' అనుకున్నది. ఆ ముచ్చటను పిచ్చుకతో చెప్పింది. ''నాకూ నీలా ఎగరాలని ఉంది. నీ ఈకలు ఇస్తే ఎగురుతాను!'' అన్నది. అందుకు పిచ్చుక.. ''అలా వీలుకాదు మిత్రమా! గాలిలో ఎగరాలంటే రెక్కలు ఉండాలి. అంతేకానీ, ఇలా ఈకలను కట్టుకొని ఎగరలేవు!'' అని చెప్పింది. అయినా చీమ వినిపించుకోలేదు. ''ఫరవాలేదు! నేను ఎగురుతాను. వాటిని నా ఒంటికి అంటించుకున్నాక.. నన్ను పైనుంచి వదిలేయి. అలాగే ఎగురుకుంటూ కిందికి వస్తాను!'' అంటూ మంకుపట్టు పట్టింది చీమ. చేసేది లేక ''సరే! నీ ఇష్టం!'' అంటూ పిచ్చుక తన రెండు ఈకలను చీమకు అంటించి.. గాల్లో వదిలేసింది. అంతే! చీమ గింగిరాలు కొడుతూ కిందపడింది. ఇంకేముంది... దట్టమైన ముండ్ల పొదలో ఇరుక్కోవడంతో బయటికి వచ్చే ప్రయత్నంలో కాళ్లు విరిగి, ఓ మూలన కూర్చుంది. అత్యాశ వల్లే తనకీ గతి పట్టిందని ఎంతో దుఃఖించింది.

కథ

నీతి : దురాశకు పోకుండా దొరికిన దానితో తృప్తిచెందడం మేలు!

● కయ్యూరు బాలసుబ్రమణ్యం



### కనుక్కోండి

కింది బొమ్మ సరైన నీడను కనుక్కోండి.



### తేడాలు కనుక్కోండి

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 6 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com